# అంతర్యంలోని అపోహ

రచన : శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

కమల సంక్రాంతికి పుట్టింటికి వెళ్ళివచ్చినప్పటినుంచీ తనభర్త ప్రవర్తనలో వచ్చిన మార్పుని స్పష్టంగా గుర్తించగలిగింది. ఇదివరకు యింటిదగ్గర వున్నంతసేపూ తన సమ్ముఖాన్నే కోరే భర్త; క్షణంతీరిక చిక్కితే తనతో ఆనందంగా బాతాఖానీ వేసేభర్త; ఇప్పుడు తన ముఖం చూడ్డానికే విముఖుడుగా వుంటున్నాడు. తన పలుకులకోసం పలవరించే తన భర్త, తను పలకరించినా సరిగా మాట్లాడ్డం లేదు. తను పుట్టింట్లో వున్న ఈ రెండు నెలల్లోనూ అతనిలో యింతమార్పు కల్గుతుందని కమల కలలోకూడా ఊహించలేదు. తనని పండక్కి పుట్టింటికి పంపించేటప్పుడు కూడా ఎంతో ఆప్యాయతతో మాట్లాడిన భర్త, యిప్పుడు ఈవిధంగా ప్రవర్తించడంలో కారణం కనుక్కోలేక ఉక్కిరి బిక్కిరై పోతోంది.

కమలకు తనభర్త రమణారావుమీద అవ్యాజమైన అనురాగం వుంది. రమణారావు కూడా కమలను ప్రాణంగా ప్రేమిస్తున్నాడు. కమల తనదగ్గరుంటే ముల్లోకాలు ఏమైపోయినా తనకేమీ ఫర్వాలేదనే వాడు. తన జీవిత సర్వస్వం తన భార్యేనని చెప్తూ, అల్లాగే ప్రవర్తించేవాడు రమణారావు. సంక్రాంతికి తనకి శెలవులేదనీ, పండగ వెళ్ళినవెంటనే వచ్చెయ్యమనీ పదేపదే చెప్పిపంపించాడు భార్యని. సంక్రాంతి వెళ్ళాక ముక్కనుమునుంచీ పదిరోజులకి సావిత్రీ గౌరీదేవి నోము ఆది పూర్తికాగానే వస్తానని చెప్పింది కమల. అందుకు అతడు సమ్మతించే పంపించాడు. అన్నమాట ప్రకారం కమల వచ్చేసింది. కాని వచ్చిననాటినుంచీ కూడా అతనిలో మార్పు కన్పిస్తూనే వుంది. ఆ మార్పుకి కారణం మాత్రం ఆమెకి అవగాహన కావడంలేదు. పోనీ మరేదైనా దురలవాట్లకు లోనయ్యాడేమో అనుకోందామన్నాగాని కమలకి అటువంటి లక్షణాలు అతనిలో ఏమీ కన్పించడం లేదు. ఆఫీసుటైమ్ తప్పించి మిగతా సమయమంతా యింట్లోనే ఏకాంతంగా ఆలోచిస్తూ కూర్చుంటున్నాడు! తను దగ్గరకి వెళ్ళినా, పలకరించినా తననో పురుగును చూచినట్లు చీదరింపుగా చూచి విదిలించేస్తున్నాడు. పోనీ ధైర్యంగా ఎందుకీ మౌనం? అని భర్తని అడగాలని మనస్సులో వున్నా కాని ధైర్యంచేసి అడిగే సాహసం లేదు తనకి. వర్తమానంలో కమల మనస్థితి విరబూసిన పారిజాత వృక్షంలా వుంది. భర్తను గురించి ఆలోచిస్తూన్న కొద్దీ జలజల రాలుతున్నాయి. ఆ పుష్పాలు - మనస్సు కంపిస్తోంది. తనలోని ఆలోచనలన్నీ ఏకంచేసి భర్తముందు కక్కేసుకోవాలనీ, కారణం కనుక్కోవాలనీ ఆరాటపడ్తూ, గదిలో మంచంమీద కళ్ళంట నీళ్ళు కారుస్తూ ఆలోచిస్తోంది.

రమణారావు సాయంకాలం ఆఫీసునుంచి యింటికి వచ్చి గదిలో ఏకాంతంగా మంచంమీద పొర్లా పడుకొన్న కమలను చూచాడు. చల్లగా పెరట్లోకి వెళ్ళి పువ్వుల మొక్కల మధ్యనున్న తిన్నెమీద కూర్చున్నాడు. దూరంగా వున్న చెట్ల కొసలమీద లేత నీరెండలు మెరుస్తూ ప్రకృతిఅంతా శోభాయమానంగా వున్నట్లుంది. కమల చేతులారా పెంచిన పూల మొక్కలు పుష్పించి కిలకిలా నవ్వుతూన్నట్లు విరజిమ్ముతూన్న పూలు; ఆకాశాన్న బారులుతీర్చి పోయే పిట్టలు, గాలికి కదిలేచెట్లు, తీయనిశోభ గోచరిస్తోంది. చుట్టూ ప్రకృతిలో - కుసుమభరితమైన ఆ గార్డెన్‌లో అతని కళేబరం వున్నా, మనస్సు మాత్రం ఆ పరిసర ప్రాంతాల్లోని ఆనందాన్ని వదలి బోనులో యిరుక్కున్న సింహంలా గర్జిస్తోంది. తన భార్య కమలను గురించి ఆలోచనలు సాగిపోతున్నాయి అతని మెదడులో.

తనూ కమలా వివాహబంధంలో ముడిపడి నవమాసాలైంది. ఇన్నాళ్ళనుంచీ కమలా తనూ ఒకేచోట వుంటున్నా తను కమలను అర్థం చేసుకోలేకపోయాడా? కమలను తల్చుకొన్న కొద్దీ రమణారావు హృదయం దహించుకుపోతోంది. కోపంతో అతని ముఖం జేవురించిపోయింది. అగ్నిపర్వతంలాగ లోలోపల మండిపోతున్నాడు. కళ కళలాడే అన్నంలా అతని మనస్సు ఉడికిపోతోంది. కమల తనకు అన్యాయం చేసింది. కమల చూపించే అనురాగమంతా కపటమేనన్నమాట! కమల తన అంతర్యంలోని అనురాగాన్ని, రహస్యాలనీ తనతో

చెప్పి క్షమించమని కోరినట్లయితే తను మన్నించేవాడే! కాని ఆమె తనని ఏనాడూ అల్లా అర్థించలేదే! పైగా తన జీవిత సర్వస్వం భర్తేనన్నట్లు నటిస్తూ తన ముందు ప్రవర్తిస్తూంది. ఆమె పుట్టింటికి వెళ్ళడంచేత, తనేబట్టలు తీసుకోవాల్సిన అవసరం వచ్చింది కాబట్టి ఆమె పెట్టెను తను చూడాల్సివచ్చింది. ఆ బట్టలుతీసే తొందర్లో ఆమె అంతర్యంలోని గుప్తరహస్య వస్తువు బయటపడింది. ఆ రోజునుంచీ తనకి కమలమీద అసహ్యంగానే వుంది. ఎంత ప్రేమించే భర్తఅయితే మాత్రం 'నిజస్వరూపం' కళ్ళారా చూచాక కూడా అటువంటి కలుషితురాలితో కలిసిమెలిసి వుండడానికి అంగీకరిస్తాడా? ఆనాటినుంచే రమణారావు హృదయంలో అనుమానం ప్రవేశించి అనురాగం నిష్క్రమించింది. ఆమె చేసే పనులన్నింటినీ విమర్శించుకోవటం ప్రారంభించాడు. భార్యని రమ్మని వ్రాయకుండానే ఆమె వచ్చేసింది. కమల వచ్చాక అతనిలో ఎంత అణుచుకోందామన్నా అణగారక ద్వేషం రగుల్తూనే వుంది. యింక యీ రోజుతో కమలతో తెగతెంపులు చేసుకోని ఏదో ఒకటి తేల్చేసుకోవాలనే తీర్మానానికి వచ్చాడు రమణారావు.

కమలకూడా మనస్సులో ధైర్యం తెచ్చుకొని భర్తను అసలు తనపై నిష్కారణంగా కోపగించడానికి తగిన కారణమేదో తెల్సుకోవాలనే సాహసంతో గుమ్మంలోకివచ్చి కాచుకు కూర్చుంది. సూర్యాస్తమయంకూడా అవుతోన్నా తన భర్త యింటికి రాకపోవడానికి కారణమేమో? అని ఆలోచిస్తూ దొడ్లోకి వచ్చింది. చామంతిమొక్కల దగ్గర కూర్చుని తీగలని, లతలని చేతితో త్రుంపుతూన్న రమణారావు కన్పించాడు. అల్లాగే నిల్చుని ఆమె అతని ముఖమే పరికించి చూస్తోంది. విశాలమైన నుదుటిమీద ఆలోచనాభారంవల్ల కాబోలు (శీతకాలమైనా) చిరుచెమటలు పోసినట్లు యింట్లోంచి పడిన దీపకాంతి మెరుపులో ముత్యాల్లా మెరుస్తున్నాయ్-ఎప్పుడూ చిరునవ్వు చిందులాడే ఆ ముఖం ఇప్పుడు కందగడ్డలావున్నా, అదీ ఒక తేజస్సుతోనే వెలిగిపోతోంది. మోచేతులపైకి మడచిపెట్టిన అతని షర్టు, ఆ మడతలు అందంగా అమర్చిపెట్టిన ఆ సౌందర్యం, సుకుమారమైన ఆ చేతికి ఆ రిష్టువాచ్, ధగధగా మెరిసే ఉంగరాలు, గుండీ ఊడిపోయిన ఆ లాల్చీ, ఉంగరాలు తిరిగిన జుట్టు ఫాలభాగంపైబడి నాట్యంచేస్తోంటే అల్లాగే తలవంచుకు దీర్ఘంగా ఆలోచిస్తూన్న రమణారావుని చూచింది కమల. మామూలుగా అయితే ఆమె వెళ్ళి అతని ప్రక్కనే ఆశీనురాలయ్యేదే!—కాని ఊహించినకొద్దీ ఆమె గుండెలు బరువెక్కిపోతున్నాయ్. యం. ఎ. చదివి, సంస్కార హృదయంగల తన భర్త తననిల్లా అనాదరణ చెయ్యడంలో—ఆమెకి కళ్ళంట నీళ్ళతో బాటు బరువుగా నిట్టూర్పులు వచ్చాయి.

గాజుల గలగల శబ్దానికి రమణారావుకూడా తల పైకెత్తి చూచాడు. కమల ముఖం కన్పించేసరికి అతని ముఖం జేవురించి, కళ్ళు క్రూరంగా అయిపోయి జ్యోతుల్లా మండుతున్నాయి. "కమలా!" అన్నాడు. ఆ పిలుపు కారు హారన్ మ్రోగించినట్లుగా వుంది.

కమల మనస్సు ఎందుటాకులా అల్లల్లాడిపోతోంది. అతని చూపుల వేడికే తట్టుకోలేని ఆమె, ఆ పిలుపుతో నిలువునా కంపించిపోతూ నిలబడింది.

"నువ్వు పరమ పవిత్రురాలవనుకొన్నానుకాని; పరమ కిరాతకురాలవని, నమ్మించి మోసంచేసే ద్రోహివనీ నేనూహించుకోలేకపోయాను."

ఆ మాటలు కమల గుండెల్లో ఈటెల్లా నాటుకొని బిగ్గరగా ఏడ్వాలనిపించింది. అయినా పొంగుకొస్తూన్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకొని "నేనేం నేరం చేసాను?" అంది.

"కమలా! నువ్వు భద్రంగా దాచుకొనే రహస్య వస్తువు నాకళ్ళబడింది. దాన్నిగురించి నువ్వే చెబుతావని ఎదురుచూచా. కాని చివరకి నా నోటిమీదుగానే చెప్పించేటంత ఘటికురాలవనుకోలేదు."

"నాకింతవరకూ రహస్యమైనదేమీ లేదని ప్రమాణం చేసి చెప్పగలను" అంది కన్నీరు జలజలా రాలుస్తూ కమల.

"నోర్మూయ్! ఇంకా ఎంతకాలం నన్ను మోసంచేద్దామనుకొంటున్నావ్? రా చూపిస్తా! యివ్వాళతో ఎవరిదారి వారిదే!" అంటూ విసురుగా యింట్లోకి వచ్చి తన బట్టలోంచి ఓ ఫొటో తెచ్చి "నీ అంతరంగిక భర్త ఈతడేనా?" అని గర్జించాడు.

ఒక్కసారిగా నిర్విణ్ణురాలైనట్లు కొయ్యబారి నిల్చుండి పోయింది కమల.

'వెళ్ళు - ఈతనిదగ్గరకే వెళ్ళిపో - మనుము ఒకరి మనస్సులో మరొకరు వుండి కాపురం చేసేకంటే

స్వేచ్ఛగా నీ యిష్టమొచ్చినచోటకి వెళ్ళిపో–' అని అరిచాడు.

'ఈ ఫోటో నాదే!' అంది అభిమానంతోనూ దుఃఖంతోనూ.

'అవును - నువ్వు దాచుకొన్నదే.' కర్కశంగా అన్నాడు.

'ఇది డ్రామాలో నా వేషం. మా గర్ల్స్ హైస్కూల్లో 'ఆదర్శం' డ్రామాలో నేను అభ్యుదయ భావాలు గల యం. ఎ. చదివిన యువకునిగా నటించాను. ఆ పాత్రను నేను అద్భుతంగా నటించానని ప్రశంసాపత్రం కూడా యిచ్చారు. యిదిగో చూడండి...' అంటూ పెట్టెతీసి ఓ కవరు చేతికిఇచ్చింది కమల.

ఆతడు ఆ ఫోటోవైపు కన్నార్పకుండా చూస్తున్నాడు. తలమీద హాట్, కళ్ళకు రిమ్‌లెస్ కళ్లజోడు, ఫ్రెంచ్ కట్ మీసాలు, సూటూ, బూటూతో, ఒక విలాస యువకునిలాగా గోచరించే ఆ ఫోటోలోని వ్యక్తి పోలికలు చూస్తున్నాడు. వేషధారణ ఎంత అద్భుతంగా వున్నా ముఖంలోని పుట్టుమచ్చలు, నుదురుమీది బాల పాప చిన్నిమచ్చ స్పష్టంగా కన్పిస్తూ 'నేనే కమలను సుమా!' అని రమణారావుని వెక్కిరిస్తూన్నట్లు, ఆమె పోలికలు అన్నీ సరిపోయి కొట్టొచ్చినట్లు కన్పించడంతో రమణారావు హృదయంలో రగుల్తూన్న అగ్ని చల్లారిపోయింది. ప్రశంశాపత్రం కూడా చదివి కమల ముఖంలోకి చూస్తూ 'తన ఆంతర్యంలోని అపోహ'కి సిగ్గుపడ్తూ 'కమలా! యిన్నాళ్లూ ఎందుకు నాకీ సంగతి చెప్పలేదు?' అన్నాడు.

'సంక్రాంతికి మీరు మా పుట్టింటికివస్తే మిమ్మల్ని మా స్కూలుకి తీసుకెళ్ళి టీచర్సుతో పరిచయంచేసాక ఈ సంగతి చెప్పాలనుకొన్నా. అంతలోనే ఆ ఫోటో చూచి మీరు అలిగి ఆలిమీద అభాండారాలు రుద్దుతారనుకోలేదు...'

'నన్ను క్షమించు కమలా! ఆరోజే నిన్ను అడిగేస్తే వదిలిపోయేదానికి నా మనస్సులో యిన్నాళ్ళూ నానా క్షోభా పడ్డాను. నీ మనస్సు నొప్పించాను.' అంటూ తన మనస్సులోని సంఘర్షణ అంతా చెప్పాడు రమణారావు.

'మీ తప్పుమాత్రం ఏముంది లెండి! అనుమానపడ్డం అసహజమైందేమీ కాదుగా. అనుమానంతో అఘాయిత్యానికి పాల్పడకుండా వున్నందుకు మిమ్మల్ని ప్రార్థిస్తున్నా.' అంది చిలిపిగా నవ్వుతూ కమల.

యిద్దరికి కింకిలలతో ఆ ప్రకృతి కలకలలాడింది.

DEPENDABLE PLACE
For DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE,
BENGAL, etc.
SAREES

SILK of EVERY STYLE HANDLOOM
COTTON SAREES; DHOTIES and
other Clothing materials.

ALL OF THE HIGHEST QUALITY

S. R. B. Kuppuswamy Iyer & Son,
(Formerly :—S. R. BALUSWAMY IYER & SONS)

230, East Marret Street, Madurai. Phone: 36
117, Nyneappa Naick Street, P. T. Madras. Phone: 32206.